AKSHARA TODAY
అక్షర నేటిడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

డివై'డర్'లు





ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మరువలేం..

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఈరవత్రి అనిల్ బర్త్‌డే



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నగరంలోని స్నేహా సొసైటీలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ ఆధ్వర్యంలో మాజీ విప్ ఈరవత్రి అనిల్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసిన అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పార్టీ అధికారంలో లేని సమయంలోనూ ప్రజల్లో నిరంతరం ఉంటూ పార్టీ అభివృద్ధికి ఈరవత్రి అనిల్ కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు గోపి, రాజు యాదవ్, కౌశిక్, బాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.



హోటళ్లు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు

అక్షరటుడే, కామారెడ్డి: జిల్లాలో ఆహార భద్రతా అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంతో పాటు భిక్కనూర్ ప్రాంతాల్లోని పలు హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా మాల్గుడి మల్టీ రెస్టారెంట్, హోటల్ ఆనంద్ భవన్, నషా బార్ అండ్ రెస్టారెంట్లతో పాటు మరికొన్ని హోటళ్లలో తనిఖీలు చేశారు. పలు చోట్ల తీవ్ర పరిశుభ్రత లోపాలను గుర్తించారు. వంటశాలల్లో పాత నూనెను వాడటం, ఆహార పదార్థాలను బహిరంగంగా నిల్వ ఉంచడం, సిబ్బంది చేతికి గ్లౌజులు, తలకు టోపీలు ధరించకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. కొన్ని హోటళ్లు ఎలాంటి అనుమతులు లేకుండానే వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తేలింది. నిబంధనలు పాటించని హోటల్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఆహార పదార్థాలకు రంగు కోసం అక్రమంగా నిల్వ ఉంచిన కృత్రిమ రంగులను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. అనుమానిత ఆహార నమూనాలను సేకరించారు. ప్రయోగశాల నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆహార భద్రతా అధికారి విక్రమ్ తెలిపారు.



- ఓటర్లకు హియరింగ్ బాధ తప్పింది.
- తాజాగా ఎన్నికల సంఘం కీలక
- నిర్ణయం తీసుకుంది. ఇకపై ఓటర్లు
- బీఎల్‌వోల వద్దకు వెళ్లాల్సిన
- అవసరం లేదని, బీఎల్‌వోలే ఓటర్ల
- ఇంటికి వచ్చి వివరాలు
- తీసుకుంటారని నిర్ణయించింది.
- ఆధారాలు చూపించి ఓటును
- నవీకరించుకునేందుకు ఓటర్లకు
- తిరిగే సమస్య తప్పినా ఇప్పుడా
- భారం బీఎల్‌వోలపై పడింది.

– అక్షరటుడే, కామారెడ్డి



ఓటర్ల ఇంటికే బీఎల్‌వోలు

- ఓటర్లకు తప్పిన హియరింగ్ కష్టాలు
- పనిభారం పెరుగుతుందంటున్న బీఎ
- జిల్లాలో 53,644 మంది ఓటర్ల వివరాలు సేకరించాల్సిన బీఎల్‌వోలు

కామారెడ్డి జిల్లాలో సర్ ప్రక్రియ అనంతరం 1,84,742 మందికి అధికారులు నోటీసులు జారీ చేయగా ఇంకా 7,984 మందికి అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంది. ఇందులో 1,23,114 మంది తమ వివరాలు అధికారులకు అందించగా 53,644 మంది తమ ఓటు హక్కుకు సంబంధించిన పత్రాలు అందించాల్సి ఉంది. ప్రస్తుతం అంతమంది వద్దకు బీఎల్‌వోలే స్వయంగా వెళ్లి పత్రాలు స్వీకరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఎన్నికల సంఘం నిర్ణయంతో కామారెడ్డి జిల్లాలో పెండింగ్ లో ఉన్న వేలాది ఓట్ల భవిష్యత్తుపై ఉత్కంఠ నెలకొంది.

ఓటర్లకు తప్పిన హియరింగ్ కష్టాలు

గతంలో సర్ నోటీసు వస్తే ఓటర్లు తప్పనిసరిగా అసలు పత్రాలతో ఎన్నికల నమోదు అధికారి ముందు హాజరు కావాల్సి వచ్చేది. దీంతో ఉద్యోగులు, కూలీలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం గుర్తించబడని లేదా తార్కిక వ్యత్యాసం పేరుతో నోటీసులు అందుకున్న వారు సాధారణంగా హియరింగ్ కు హాజరు కావాల్సిన అవసరం లేదు. బీఎల్‌వోలే ఇంటికి వచ్చి పత్రాలు తీసుకుని ఈసీఐ నెట్‌లో అప్‌లోడ్ చేస్తారు. నమోదు అధికారి ప్రత్యేకంగా అవసరమని భావించిన కేసుల్లో మాత్రమే ఆన్‌లైన్‌లో హియరింగ్ ఉండే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది.

53,644 మంది ఓటర్ల వద్దకు బీఎల్‌వోలు

కామారెడ్డి జిల్లాలో 'సర్' ప్రక్రియ అనంతరం 1,84,742 మందికి అధికారులు నోటీసులు జారీ చేయగా, ఇంకా 7,984 మందికి నోటీసులు ఇవ్వాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు 1,23,114 మంది మాత్రమే తమ అసలు పత్రాలు సమర్పించారు. ఇంకా 53,644 మంది తమ ఓటు హక్కుకు సంబంధించిన పత్రాలు అందించాల్సి ఉంది. ప్రస్తుతం ఈ 53 వేలమంది వద్దకు బీఎల్‌వోలే స్వయంగా వెళ్లి పత్రాలు స్వీకరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

బీఎల్‌వోలకు పనిభారం

ఓటర్లకు వెసులుబాటు కల్పించడం మంచిదే అయినా ఆ భారం మొత్తం క్షేత్రస్థాయిలో పనిచేసే బీఎల్‌వోలపై పడింది. ఇప్పటికే ఓటర్లు ఫోన్ ఎత్తకపోవడం, ఇంటికి వెళ్తే రేపు రండి అని చెప్పడం, రోజువారీ నివేదికలు పంపాల్సి రావడం బీఎల్‌ఓలకు తలనొప్పిగా మారింది. ఒకేసారి వేల మంది ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించడం సాధారణ విషయం కాదని, అదనపు సిబ్బంది లేదా గడువు పొడిగింపు అవసరమని వారు కోరుతున్నారు. బీఎల్వోలు వస్తారని ఓటర్లు అలసత్వం వహించే అవకాశం ఉంది. దీంతో ఓటు హక్కు పోయే ప్రమాదం ఉంది.



11 నుంచి 21 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : వచ్చేనెల 11వ తేదీ నుంచి 21 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించాలని నిజామాబాద్ దేవీ నవరాత్రుల సార్వజనిక్ సమితి సూచించింది. శనివారం నగరంలోని సిర్నాపల్లిగడిలో సమితి మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా వేద పండితులు సంతోష్ శర్మ మాట్లాడుతూ దేవీనవరాత్రుల ఉత్సవాల నిర్వహణ తేదీలను ప్రకటించారు. అక్టోబర్ 11న దేవీమాత విగ్రహాలను ప్రాణప్రతిష్ట చేసి 21న నిమజ్జనం చేయాలన్నారు. సమితి గౌరవ ధ్యక్షుడు ఇప్పకాయల హరిదాస్, అంబెం సాయిలు, జి.రాజేశ్వరి, రవీందర్, శ్రీకాంత్, కృష్ణమూర్తి, రాజేందర్, రమేష్ పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేయాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఇచ్చిన పిలుపు మేరకు మూడురోజుల పాటు బ్యాంకు ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధి కొలుగూరి రాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 28, 29, 30 తేదీల్లో మూడు రోజుల సమ్మెలో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకింగ్ ఉద్యోగుల ప్రధాన న్యాయమైన డిమాండ్ అయిన వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్‌ను వెంటనే అమలు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ



అక్షరటుడే, కామారెడ్డి: సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కొనియాడారు. చాకలి ఐలమ్మ 131వ జయంతి కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్అండ్బీ గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన తెగువ, నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె చేసిన పోరాటం ప్రజాస్వామ్య విలువలను, సమానత్వాన్ని బలోపేతం చేసిందని, ఆమె ఆశయాలకు అనుగుణంగా ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, గౌరవం కల్పించడమే నిజమైన నివాళి అని తెలిపారు. ఆమె స్ఫూర్తితో సామాజిక సమానత్వం, మహిళా సాధికారత కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్వై గిరి, తహశీల్దార్ హిమబిందు, బీసీ సంక్షేమ అధికారి నర్సయ్య, గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణి, వైస్ చైర్‌పర్సన్ గోదావరి స్వామి, టీఎన్జీవోస్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పనులకు అత్యంత ప్రాధాన్యత: కలెక్టర్ భవేష్ మిశ్రా



అక్షరటుడే నిజామాబాద్ సిటీ : గోదావరి పుష్కరాల పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ భవేష్ మిశ్రా పేర్కొన్నారు. హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు పుష్కర ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటికే కందకుర్తి, యంచ వద్ద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా పనులు ప్రారంభించామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పుష్కరాలకు గడువు సమీపిస్తున్నందున పనులను తక్షణమే చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని కందకుర్తి పుష్కర క్షేత్రంతో పాటు బాసరకు ఆనుకుని అత్యంత చేరువలో ఉన్న యంచ వద్ద ఎండోమెంట్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్అండ్బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు వీలుగా శంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు. కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని కలెక్టర్ అన్నారు. ఎస్సారెస్పీలో ప్రస్తుతం 46 టీఎంసీల వరకు నీరు నిలువ ఉందని, 20 నుండి 25 టీఎంసీలకు నీటి మట్టం చేరిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు. మిగతా పనులను వెంటవెంటనే చేపట్టి, మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు. కందకుర్తి, యంచతో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ తదితర పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీఐపీలు, వీవీఐపీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు .వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియ, డీఆర్వో గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న పాల్గొన్నారు.

సాందీపని డిగ్రీ విద్యార్థుల విజ్ఞాన యాత్ర



అక్షరటుడే, కామారెడ్డి: సాందీపని డిగ్రీ కళాశాల లైఫ్ సైన్సెస్ విభాగానికి చెందిన విద్యార్థులు హైదరాబాద్‌లో విజ్ఞాన యాత్ర చేపట్టారు. హబ్సిగూడలోని సీఎస్ఐఆర్ సీసీఎంబీ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ) కేంద్రాన్ని శనివారం సందర్శించారు. జీవ కణాల పనితీరు, జీవుల జీవక్రియలను అర్థం చేసుకోవడం ద్వారా వైద్య, వ్యవసాయ, వన్యప్రాణి సంరక్షణ రంగాల్లో ఎలాంటి అభివృద్ధి సాధించవచ్చో అక్కడి శాస్త్రవేత్తల ద్వారా విద్యార్థులు తెలుసుకున్నారు. అనంతరం తార్నాకలోని సఫల ఆర్గానిక్స్ లిమిటెడ్ సంస్థను సందర్శించారు. వైద్య రంగంలో ఉపయోగించే ముడి పదార్థాలు, మందుల తయారీ విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సఫల ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ పైడి ఎల్లారెడ్డి విద్యార్థులతో మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ యాత్రలో కళాశాల లైఫ్ సైన్సెస్ విభాగాధిపతి బాలనర్సు, అధ్యాపకురాళ్లు అంజని భార్గవి, నివేదిత, మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ సాయిబాబు అభినందించారు.

ప్రత్యేక లోక్ అదాలత్‌లో 103 కేసుల పరిష్కారం

అక్షరటుడే, కామారెడ్డి: న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం బ్యాంకు రుణ బకాయిలు, రికవరీ కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డా. సూర సమలత అధ్యక్షతన జరిగిన ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో వివిధ జాతీయ, ప్రైవేట్ బ్యాంకులకు చెందిన అధికారులు, న్యాయవాదులు, రుణగ్రహీతలు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి మండల న్యాయ సేవా కేంద్రాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను ఈ అదాలత్ కోసం గుర్తించారు. మొత్తం 103 బ్యాంకు రికవరీ కేసులను పరిష్కరించారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం రూ. 51,90,450 మేర ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీ కుదిరి అవార్డులు జారీ చేశారు. న్యాయమూర్తులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మరువలేం : టీపీపీసీ చీఫ్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మరువలేమని టీపీపీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నగరంలోని వినాయక్ నగర్‌లోని విగ్రహాల పార్క్‌లో చాకలి ఐలమ్మ విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ చిరస్థాయిగా నిలిచిన యోధురాలు అని పీసీసీ చీఫ్ అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తి ఎందరినో కదిలించిందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అణగారిన వర్గాలకు ఆమె శక్తిగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో వీరనారిగా నిలిచిన చాకలి ఐలమ్మ త్యాగానికి గుర్తుగా ప్రతి ఏడాది సెప్టెంబర్ 26న తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ, నగేష్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, రామ్ భూపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెండా బాలాజీ ఆలయంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, అరికెల నర్సారెడ్డి, పుప్పాల రవి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆర్చరీ జిల్లా స్థాయి సెలక్షన్స్ ప్రారంభం



అక్షరటుడే, బాన్సువాడ: మండలంలోని తిర్మలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్చరీ జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఎస్‌జీఎఫ్ కన్వీనర్, ఎంఈవో నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఆర్చరీ క్రీడ విద్యార్థుల్లో ఏకాగ్రత, లక్ష్యసాధన, పట్టుదలను పెంపొందిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సైతం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. సెలక్షన్ పోటీలను పూర్తి పారదర్శకతతో నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయాలని ఆయన సూచించారు. ఆర్చరీ వంటి క్రీడలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడా రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీధర్, సర్పంచ్ సాయిగౌడ్, ఉప సర్పంచ్ ఖలీల్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్ వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.
– అక్షరటుడే, కామారెడ్డి



డివై'డర్'లు

■ కామారెడ్డి పట్టణంలో భయపెడుతున్న రహదారులు ■ అస్తవ్యస్త రోడ్లతో అవస్థలు.. ■ డివైడర్లను సరిచేయాలని వాహనదారుల వేడుకోలు

నిజాంసాగర్ చౌరస్తా నుంచి కొత్త బస్టాండ్ వైపు వెళ్లే దారిలో గతంలో పాత బస్టాండ్ వైపు వెళ్లేందుకు యూటర్న్ ఉండేది. ట్రాఫిక్ సమస్య కారణంగా పోలీసులు ఆ దారిని మూసివేసి బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో నిజాంసాగర్ చౌరస్తాలో పని ఉండే వాహనదారులు మున్సిపల్ ఆఫీస్ నుంచి యూటర్న్ తీసుకొని మళ్లీ చౌరస్తా వద్దకు రావడం ఇబ్బందిగా మారింది. దీంతో చౌరస్తాకు కాస్త ముందే డివైడర్‌ను తొలగించి యూటర్న్‌కు వెసులుబాటు కల్పించారు. అయితే డివైడర్ తొలగించిన చోట రోడ్డు మధ్యలో బేస్‌మెంట్ ఎత్తుగా ఉండి, రోడ్డు లెవల్ చేయకపోవడంతో ఆ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారింది. యూటర్న్ తీసుకునే క్రమంలో వాహనాలు మధ్యలోనే ఆగిపోవడం, అదుపుతప్పి పడిపోవడం జరుగుతోంది.

వరుస ప్రమాదాలు..


రెండు రోజుల క్రితమే ఇద్దరు వ్యక్తులు స్కూటీపై యూటర్న్ తీసుకుంటూ కిందపడిపోయారు. అదృష్టవశాత్తు వెనుక నుంచి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ నుంచి నిజాంసాగర్ వైపు వచ్చే వాహనాలు ఈ యూటర్న్ వద్ద వాహనాలను ఢీకొనే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డివైడర్ తొలగించి దారి ఇచ్చినప్పుడు అక్కడ సిమెంట్ లేదా బీటీ వేసి రోడ్డును లెవల్ చేసి ఉంటే ఈ ప్రమాదాలు జరిగేవి కావని వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముప్కాల్‌లో జాతీయ పోషణ మాసోత్సవాలు



అక్షరటుడే, ముప్కాల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ఈసీసీఈ డే కార్యక్రమాన్ని నిర్వహించి, చిన్నారుల సంరక్షణ, విద్యపై అవగాహన కల్పించారు. అనంతరం పోషణ ప్రతిజ్ఞ చేయించారు. పిల్లల సంపూర్ణ ఎదుగుదలకు శారీరకంగా, మానసికంగా, మేధోపరంగా అభివృద్ధి చెందేందుకు సమతుల్యమైన పోషకాహారం అందించడం ప్రాధాన్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మధుకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, గ్రామ కార్యదర్శి దివ్య, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.







ఐలమ్మ పోరాట స్ఫూర్తిని మరువలేం..

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ చిరస్థాయిగా నిలిచిన యోధురాలు అని వక్తలు పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ వ్యాప్తంగా అణగారిన వర్గాలకు ఆమె శక్తిగా నిలిచారన్నారు. తెలంగాణ ప్రజల హృదయాల్లో వీరనారిగా నిలిచిన వీరవనిత ఆమె అని అన్నారు.
– అక్షరటుడే, నెట్‌వర్క్









చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన సదస్సు

అక్షరటుడే, ఆర్మూర్ : ఆలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం చైల్డ్ హెల్ప్ లైన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలల హక్కులు, బాలల పరిరక్షణ చట్టాలు, ఆపద సమయంలో అందుబాటులో ఉండే చైల్డ్ హెల్ప్ లైన్ సేవలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాలలకు విద్య, రక్షణ, అభివృద్ధి, గౌరవంగా జీవించే హక్కులు ఉన్నాయని తెలిపారు. బాలలపై ఎలాంటి వేధింపులు, హింస, దోపిడీ జరిగినా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎం. నరేందర్ పాల్గొని బాలల హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న జిల్లా బాలల పరిరక్షణ విభాగం సభ్యులను అభినందించారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని, బాల్య వివాహాలు, బాలలపై జరిగే వేధింపులను అరికట్టడంలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆదర్శ విద్యార్థులకు సామగ్రి అందజేత



అక్షరటుడే, బాల్కొండ: మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలోని వసతి గృహ విద్యార్థినులకు బ్యాగులు, బూట్లు, ట్రంక్ పెట్టెలను ఎంఈవో కృష్ణవేణి, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ ప్రసాద్ మీపంపిణీ చేశారు. కృష్ణవేణి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలతో పాటు బ్యాగులు, బూట్లు, వసతి గృహ విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ గణేష్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పోచంపాడ్ జామా మసీద్ సదర్‌గా అజీజ్ హుస్సేన్ అన్సారీ



అక్షరటుడే, మెండోరా: పోచంపాడ్ గ్రామంలోని జామా మసీద్‌కు సదర్ ఎన్నికలు నిర్వహించారు. సదర్ పదవికి ముగ్గురు అభ్యర్థులు పోటీ చేయగా, అజీజ్ హుస్సేన్ అన్సారీ వరుసగా మూడోసారి విజయం సాధించారు. మసీద్ సభ్యుల ఎన్నికల్లో మొత్తం 19మంది అభ్యర్థులు పోటీ చేయగా, 11మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యుల్లో మహమ్మద్ సలీం, అబ్దుల్ బారి, మహమ్మద్ సాజిద్, అలీ షైక్, నిసార్, మహమ్మద్ ఇర్ఫాన్, బైగా షైక్ జావీద్, సుమర్ నసీమ్ పాషా, మజీద్, కాలీముద్దీన్ ఉన్నారు. వరుసగా మూడోసారి సదర్‌గా ఎన్నికైన అజీజ్ హుస్సేన్ అన్సారీతో పాటు నూతనంగా ఎన్నికైన మసీద్ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

వీడీసీలను రద్దు చేయాలని సీపీఐ డిమాండ్



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: జిల్లాలో వీడీసీలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయానికి విచ్చేసిన తాళ్ల రాంపూర్ బాధితులతో ఆయన మాట్లాడారు. సుధాకర్ మాట్లాడుతూ.. బాల్కొండ నియోజకవర్గంలో వీడీసీల ఆగడాలు మితిమీరుతున్నాయని ఆరోపించారు. తాళ్ల రాంపూర్‌లో వీడీసీ సభ్యులు చేసిన తప్పులకు పోలీస్ శాఖ నోటీసులిచ్చిందని.. దీనికి సాకుగా చూపుతూ.. తాళ్ల రాంపూర్‌కు చెందిన 32 గీత కార్మిక కుటుంబాలు, 12 దళిత కుటుంబాలను గ్రామబహిష్కరణ చేయడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఏర్పాటైన ప్రజాప్రతినిధులు కాకుండా స్థానికంగా వీడీసీల పేరుతో ఆధిపత్యం చలాయిస్తూ కొన్ని వర్గాల వారిపై గ్రామ బహిష్కరణ చేస్తుండడం శోచనీయమన్నారు.

న్యాల్కల్ కెనాల్‌లో పడి ఒకరి మృతి

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: ప్రమాదవశాత్తు కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన న్యాల్కల్ కాలువ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. న్యాల్కల్ గ్రామానికి చెందిన భక్తుల దశరథ్ శుక్రవారం ఉదయం స్నానం చేయడం కోసం న్యాల్కల్ కాలువలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మోపాల్ పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రంగంలోకి దించారు. నిజామాబాద్ ఫైర్ స్టేషన్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం ఉదయం దశరథ్ మృతదేహాన్ని కెనాల్ నుండి వెలికి తీసి, పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ కు తరలించారు. ఈ రెస్క్యూ ఆపరేషన్‌లో జిల్లా ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ ఆధ్వర్యంలో రూరల్ ఫైర్ స్టేషన్ ఇన్‌ఛార్జ్ విక్రమ్, ఎన్డీఆర్ఎఫ్ టీమ్ క్యాప్టెన్/లీడింగ్ ఫైర్ ఫైటర్ యేసు రత్నం, ఫైర్ ఫైటర్ (టెక్నికల్ ఎక్స్‌ఆర్మీ) సాయిరెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ టీమ్ సభ్యులు జయంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

29న చేనేత సమావేశం



అక్షరటుడే నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ చేనేత సహకార సంఘం సర్వసభ్య సమావేశం ఈనెల 29న మంగళవారం ఉదయం 10 గంటలకు బస్వా గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి తెలిపారు. నిజామాబాద్ చేనేత సహకార సంఘంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సర్వసభ్య సమావేశానికి చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాములు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. చేనేత సంఘం అభివృద్ధి, చేనేత కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. చేనేత సహకార సంఘ సభ్యులకు ముద్ర రుణాలు, పింఛన్ల అంశంపై కూడా చర్చిస్తామన్నారు. నిజామాబాద్ చేనేత సహకార సంఘ సభ్యులు సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడు అవదూత విఠల్, ప్రధాన కార్యదర్శి పెంటి రాజు, డైరెక్టర్ కారంపురి ప్రభు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



అక్షరటుడే, ముప్కాల్: ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో సీఎం (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారురాలు లక్ష్మీకి రూ.12,000, కోట శ్రావణ్ కుమార్‌కు రూ.19,000, నాతం చంద్రయ్యకు రూ.38,500, చాతిరి మల్కన్నకు రూ.42,500, కోట పెద్ద గంగారాంకు రూ.36,000, బట్టు లావణ్యకు రూ.18,000 చొప్పున చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె. శ్రీకాంత్ రెడ్డి, వేల్పూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జైడి చంద రవి, ఉప సర్పంచ్ సురేష్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి రాజారెడ్డి, లక్ష్మణ్, మైపాల్, తిరుపతి రెడ్డి, నర్సారెడ్డి, రాజ్ వెంకట్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.